పీడీలు లేక.. ఆటలు ఆడక!

'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్నట్లు నిరంతర సాధనతోనే క్రీడల్లో రాణించడం తేలికవుతోంది. ఈ ధోరణిని పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఆపాదించాలి. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండడంతో చిన్నారులకు శాపంగా మారింది.

- ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు కరువైన ప్రోత్సాహం
- బోధనోపాధ్యాయులపైనే భారం


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు (ఫైల్)

దౌల్తాబాద్: పాఠశాల విద్యను పటిష్ట పరిచేందుకు ఎన్నో నూతన కార్యక్రమాలు తీసుకు వస్తున్న విద్యా శాఖ.. దానికి అనుబంధమైన క్రీడలను ప్రోత్సహించడంలో విఫలమవుతుంది. ఆటలను నిర్వహించి విద్యార్థులు రాణించేందుకు పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులను కేటాయిస్తారు. కానీ ప్రస్తుతం ఆ పోస్టులు ఖాళీగా ఉండడం గమనార్హం. పాఠశాలల్లో క్రీడలు నిర్వహించాల్సిన బాధ్యత బోధనోపాధ్యాయులపైనే పడడంతో సంవత్సరంలో ఏ జాతీయ దినోత్సవాలకో రెండు మూడు సార్లు పండగలా చేపట్టి విద్యార్థులకు బహుమతులు ఇచ్చి మమా అనిపించుకుంటున్నారు. క్రీడలతో ఆరోగ్యం, శారీర దారుఢ్యం, మానసికోల్లాసం అన్న వాస్తవాలు పుస్తకాల్లో చదువుకోవడానికే పరిమితమవుతున్నారు. అరకొరగా ఉన్న ఉపాధ్యాయులతోనే విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తుండడంతో పూర్తిస్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులు ఉంటే మరింత రాణించే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

నామమాత్రంగా పీఈటీ పోస్టులు

విద్యాభివృద్ధి కోసం వేస్తున్న ప్రతి డీఎస్సీలో క్రీడలకు అన్యాయమే జరుగుతుంది. ప్రతి డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులకు సంబంధించి నామమాత్రంగా పోస్టులు కేటాయిస్తుండడంతో మండలంలో 45 పాఠశాలలుంటే ఇద్దరు వ్యాయామ ఉపాధ్యాయులతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. అయితే సీపీఎస్, యూపీఎస్ పాఠశాలల్లో పీఈటీ పోస్టులు లేవు. ఇక ఉన్నత పాఠశాలల్లో పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేసి పీడీ(ఫిజికల్ డైరెక్టర్)గా మార్చారు. మండలంలో ఐదు ఉన్నత పాఠశాలల్లో రెండింటిలో మాత్రమే పీడీలున్నారు. మెజారిటీ ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠాలు బోధించే ఉపాధ్యాయులే ఆటలాడించాల్సి వస్తోంది.

గ్రామీణ ఆటలపై చిన్నచూపు

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులు మంచి శారీర దారుఢ్యం కలిగి ఉన్నప్పటికీ వారికి శిక్షణ కరువై పాఠశాలలు, గ్రామాలకే పరిమితం కావాల్సి వస్తోంది. పట్టణ ప్రాంతాల్లో చూపించినంత శ్రద్ధ గ్రామీణ క్రీడలు, వాటికి నిధులు కేటాయించే విషయంలో చూపించకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు.

పండగలొస్తేనే క్రీడలు

ప్రతి సంవత్సరం పాఠశాలల్లో నిర్వహించే జాతీయ పర్వదినాలైనా స్వాతంత్ర్య, గణతంత్ర, బాలల దినోత్సవాలకు మాత్రమే క్రీడాలను నిర్వహిస్తున్నారు. దీంతో సరైన తర్ఫీదు లేక విద్యార్థులు ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. పూర్తిస్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులుంటే క్రీడల్లో రాణించడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి.

క్లుప్తంగా

ఘనంగా శివపార్వతుల కల్యాణం


ఉత్సవ మూర్తులు

దుద్యాల్: మండల పరిధిలోని హకీంపేట శివారులో ఉన్న పెద్దబండ శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభోవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి సుప్రభాత సేవా, ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి మల్లికార్జునస్వామి ఆలయం వరకు ఊరేగించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో కల్యాణోత్సం నిర్వహించారు.

గతుకుల రోడ్లతో తిప్పలు


ధారూరు వంతెన వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత

ధారూరు: అస్తవ్యస్తమైన రహదారులతో మండలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాండూరు–హైదరాబాద్ ప్రధాన రోడ్డుతో పాటు మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. బీటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. గతుకుల రహదారుల్లో వెళ్లాలంటే తలకు మించిన భారంగా మారుతుందని వాపోయారు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

చేసిన పనులకు నిధులివ్వండి


వినతిపత్రం అందిస్తున్న మాజీ వైస్‌ఎంపీపీ

బొంరాస్‌పేట: స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం) కింద నిర్మించిన మరుగుదొడ్లకు నిధులు మంజూరు చేయించాలని సోమవారం ప్రజావాణిలో మాజీ వైస్ ఎంపీపీ శేరినారాయణరెడ్డి వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో రూ.12వేలతో 80 కుటుంబాలకు మరుగుదొడ్ల నిర్మాణానికి గతేడాది అనుమతి పొంది, నిర్మాణం పూర్తి చేసినా ఇంతవరకు నిధులు మంజూరు కాలేదన్నారు. రూ.9.60 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని కోరారు. దీనిపై ఎంపీడీఓ వెంకన్నగౌడ్‌కు స్పందించి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

బదిలీ అయిన స్థానంలోనే వేతనాలివ్వాలి

ఏటీఓకు యూటీఎఫ్ నాయకుల వినతి

షాద్‌నగర్‌రూరల్: ఉపాధ్యాయులకు బదిలీ అయిన చోటనే వేతనాలు ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు సోమవారం ఏటీఓ(అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్)కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలామంది ఉపాధ్యాయలు ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో ఇతర పాఠశాలలకు వెళ్లారన్నారు. బదిలీపై వెళ్లిన వారికి వారు చేసిన స్థానాల్లోనే వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సగం పాత స్థానంలో, మిగితా సగం కొత్త స్థానంలో వేతనాలకు సంబంధించి బిల్లులు చేస్తున్నారన్నారు. దీంతో వేతనాలు ఎప్పుడు వస్తాయోనని వారు ఆందోళన చెందుతున్నారన్నారు. నాన్‌డ్రాన్ సర్టిఫికెట్‌తో మొత్తం జీతాన్ని ఒకేస్థానంలో చేసేందుకు ట్రెజరీ స్టేషన్‌లో అవకాశం ఉందన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని వారికి వేతనాలను కొత్త స్థానంలో చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకటయ్య, నర్సింలుగౌడ్, బాలయ్య, కృష్ణ, నర్సింలు ఉన్నారు.

కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సురేందర్

కొత్తూరు: పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండల పరిధిలోని పెంజర్ల గ్రామ పంచాయతీ సెక్రటరీ సురేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. కార్యదర్శులకు అందుబాటులో ఉంటూ వారి శ్రేయస్సు కోసం తనవంతు కృషిచేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి


వీరజవాన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డీఎస్పీ

పరిగి: విధి నిర్వహణలో అసువులు బాసిన అమరుల త్యాగాలు మరువలేనివని పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి అన్నారు. సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సుల్తాన్‌పూర్‌లోని అమరుడైన జవాన్ విజయభాస్కర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పోలీసులు లేని సమాజాన్ని ఎవరూ ఊహించలేరని, శాంతి భద్రతలను పరిరక్షించే క్రమంలో దేశంలో ఎందరో పోలీసులు, జవానులు అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్‌కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎస్‌ఏ పరీక్షలు


పెద్దేముల్: బుద్దారంలో పరీక్షను పరిశీలిస్తున్న ఎంఈఓ


దుద్యాల్: జెడ్పీ పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

దుద్యాల్: పాఠశాల ప్రారంభం నాటి నుంచి నేటి వరకు దాదాపు 50 శాతం సిలబస్‌ను పూర్తి చేశామని ఉపాధ్యాయులు తెలిపారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో సమ్మెటివ్ అసిస్‌మెంట్–1 పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 8, 9, 10వ తరగతి విద్యార్థులు గణితం విషయంపై పరీక్ష నిర్వహించగా, 5, 6, 7వ తరగతి, ప్రాథమిక స్థాయి విద్యార్థులకు తెలుగు పరీక్షను నిర్వహించారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికొన్నత, ఉన్నత, కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి.

4,100 మంది విద్యార్థులు హాజరు

పెద్దేముల్: మండలంలో సమ్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్షలకు 4,100 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ నర్సింగ్‌రావు తెలిపారు. సోమవారం మండలంలోని తింసాన్‌పల్లి, బుద్దారంలో పాఠశాలల్లో జరుగుతున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 4,443 మంది విద్యార్థులున్నారని తెలిపారు. పరీక్షల సమయంలో ఉపాధ్యాయులు తప్పకుండా సమయపాలన పాటించాలన్నారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థి పరీక్షలు రాసేలా చుడాలన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న జంగమ సమాజం సభ్యులు

కొడంగల్ రూరల్: కొడంగల్ జంగమ సమాజం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఉపాధ్యాయులుగా నియామకమైన వారితో పాటు, పదోన్నతులు పొందిన వారిని ఆదివారం రాత్రి సన్మానించారు. నియోజకవర్గంలోని కోస్గి ఇంద్రనీలేశ్వర ఆలయ ప్రాంగణంలో 2024 డీఎస్సీ ద్వారా ఎంపికై న నూతన ఉపాధ్యాయులకు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. నూతన ఉపాధ్యాయులు గడ్డం ప్రియాంక కొడంగల్, మఠం మల్లికార్జునస్వామి హకీంపేట, పదోన్నతులు పొందిన బనలక్ష్మీ చిట్లపల్లి, ఎస్.సరస్వతి రుద్రారం, ఎం.భారతి చిన్ననందిగామ ఉపాధ్యాయులకు జంగమ సమాజం నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జునస్వామి, అధ్యక్షులు హంపయ్యస్వామి, ఉపాధ్యక్షుడు వినయకుమార్ స్వామి, కోశాధికారి శ్రీశైలం, కార్యదర్శి జగదీష్ స్వామి, జిల్లా కన్వీనర్ అమరలింగస్వామిలతో పాటు కార్యవర్గ సభ్యులు సన్మానించారు.

నేడు కొండాపూర్‌లో వైద్య శిబిరం

పెద్దేముల్: మండల పరిధిలోని కొండాపూర్‌లో ఎల్ఎన్ఆర్ యువసేన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహిస్తారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు నర్సింలు తెలిపారు. కొండాపూర్‌తో పాటు నెల్లి గడ్డతండా, మదనంతపూర్ గ్రామ వాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

పెద్దేముల్: మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడొద్దని పెద్దేముల్ హెడ్ కానిస్టేబుల్ రమేశ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్, మద్యం తాగి వాహనాలు నడపితే జరిగే ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పరిగి–కొడంగల్ ప్రధాన రహదారిపై ముగ్గురు చిన్నారులు బస్సు తగిలి మృతి చెందిన ఘటనను వివరిస్తూ, మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది జైపాల్‌రెడ్డి, అశోక్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

24న సామాజిక తనిఖీ

యాలాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి సోషల్ ఆడిట్(బహిరంగ సభ)ను ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పుష్పలీల ఓ ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 31 వరకు మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన ఆడిట్ వివరాలను వెల్లడిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ హాలు ఆవరణలో కార్యక్రమం ఉంటుందన్నారు.

'వుడా' ఏర్పాటుపై కాంగ్రెస్ శ్రేణుల హర్షం

ధారూరు: సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా అభివృద్ధి కోసం వికారాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(వుడా)ని ఏర్పాటు చేయడంపై సోమవారం కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయనుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి, జిల్లా వాలీబాల్ అసోషియేషన్ అధ్యక్షుడు హనంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్లోళ్ల రాములు, నాయకులు బాబాఖాన్, నారాయణరెడ్డి తదితరులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్‌ఎస్'

కుల్కచర్ల: బీఆర్ఎస్ నేతలు కల్లబొల్లి మాటలు చెప్పడం మానేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. పదేళ్లలో రూ.లక్ష రుణాన్ని మాఫీ చేయలేకపోయిన బీఆర్ఎస్.. ప్రస్తుతం రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తే ఓర్వలేక ప్రజలను తప్పుదోవపట్టించేందుకు ఆందోళన చేస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతి కారణంగా పథకాల అమలులో ఆలస్యం జరిగిందని ఆరోపించారు.

ప్రజావాణికి దరఖాస్తులు నిల్


దౌల్తాబాద్: నలుగురు అధికారులతో ప్రజావాణి

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు రాలేవని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి మండలస్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా కేవలం విద్యుత్, ఐకేపీ, ఐసీడీఎస్ అధికారులు మాత్రమే హాజరవుతున్నారు. మిగిలిన శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో మండలవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఒకటే దరఖాస్తు

మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒకటే దరఖాస్తు వచ్చిందని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. వెల్‌చాల్ గ్రామానికి చెందిన రాంచందర్ తన భూమిని సర్వే చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్నా ఇప్పటివరకు సర్వేయర్ రాలేదన్నారు. విచారణ చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ మల్లేశం, మండల పశువైద్యాధికారి గీత, ఏపీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్లకు సత్కారం


దౌల్తాబాద్: వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: కొడంగల్ మార్కెట్ కమిటీకి నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు సోమవారం సన్మానించారు. మండలం నుంచి కొటంరాములు, సేవ్యానాయక్, నర్సిములు, వెంకట్‌రెడ్డిలు డైరెక్టర్లుగా ఎంపికయ్యారు. వారిని నాయకులు శాలువాలతో సన్మానించారు. సన్మానించిన వారిలో నాయకులు నారాయణగౌడ్, మల్కయ్యగౌడ్, వెంకటయ్య, జనార్దన్, రాములు, రాజు, బద్రి తదితరులున్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: కొడంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) డైరెక్టర్ల ఎంపిక పట్ల కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని తుంకిమెట్లకు చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకుడు బలిజ మల్లేశ్, జానకంపల్లికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అంజిలయ్య, బొంరాస్‌పేట మాజీ సర్పంచ్ చెన్నమ్మ, మందన్‌పల్లితండాకు చెందిన భాస్కర్‌నాయక్‌లకు డైరెక్టర్లుగా ఎంపికయ్యారు.

ప్రత్యేక నిధులు కేటాయించండి

స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు కోట్‌మర్పల్లివాసుల వినతి


స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృష్ణారెడ్డి గ్రామస్తులు

మర్పల్లి: మండల పరిధిలోని కోట్‌మర్పల్లి గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ బ్లాక్–2 అధ్యక్షుడు మల్కనెల్లి కృష్ణారెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన గ్రామస్తులతో కలిసి నగరంలోని స్పీకర్ స్వగృహంలో గ్రామాభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. తమ గ్రామం నుంచి రాజకీయ జీవితం ఆరంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలన్నారు. ముఖ్యంగా గ్రామం నుంచి సమీప గ్రామాలకు మోమిన్‌పేట్ మండలం సయ్యద్ అల్లీపూర్, క్యాసారం రోడ్లకు అదేవిధంగా మండలంలోని కోట్‌మర్పల్లి నుంచి వీర్లపల్లి, బూచన్‌పల్లి, రావులపల్లి గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. వీటికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ సానుకులంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మధుకర్‌రెడ్డి, డైరెక్టర్ కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, కృష్ణగౌడ్, మహిళాసంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్ర


శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములు

శంకర్‌పల్లి: పట్టణానికి చెందిన పలువురు అయ్యప్ప స్వాములు సోమవారం శబరిమలకు శంషాబాద్ నుంచి పాదయాత్రగా బయలుదేరారు. ఈ పాదయాత్ర మొత్తం 37 రోజుల పాటు నిర్విరామంగా కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శబరిమలకు వెళ్తున్న వారిలో ప్రశాంత్, సాయి కిరణ్‌రెడ్డి, ప్రేమ్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, సోనుసింగ్, ప్రవీణ్, యశ్వంత్‌రెడ్డి, వంశీలు ఉన్నారు.

విద్యార్థులకు యూనిఫాం, షూ పంపిణీ


షాద్‌నగర్: విద్యార్థులకు షూ, టై, బెల్టు అందజేస్తున్న దాత

షాద్‌నగర్: దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం రసూల్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం పటేల్‌కుంట తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామానికి చెందిన లింబ్యానాయక్ స్పోర్ట్స్ డ్రెస్, షూ, టై, నోటు బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, గోపాల్‌నాయక్, రాములు, నటరాజ్, శ్రీకాంత్, రాజు, బాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ: మండల పరిధిలోని చేగూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన బంటారం మల్లేశ్ సోమవారం ఉచితంగా యూనిఫాం, షూ, టై, బెల్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రకళ, ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజారెడ్డి, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ భాగ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు!


దుద్యాల్-సోమ్లనాయక్ తండా సమీపంలో మలుపు

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు

దుద్యాల్: ప్రమాదకరమైన మలుపులతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రం నుంచి సాగారం తండా మీదుగా కొడంగల్‌కు వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా ఐదు మలుపులు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. రోజువారి అవసరాల నిమిత్తం దుద్యాల్ చుట్టుపక్కల తండాల ప్రజలు ప్రతీరోజు రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఈ మలుపుల వద్ద అనేక సందర్భాలలో ప్రమాదాలు సంభవించి ప్రాణాలు సైతం కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ఐనప్పటికీ ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహనదారులు, సమీప తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ప్రమాద మలుపులను గుర్తించి సంబంధిత అధికారులు అవసరమైన చోట ప్రమాదహెచ్చరిక, సూచిక బోర్డులు, జీబ్రాలైన్లు ఏర్పాటు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.


బోయినిగడ్డ-సాగారం తండా సమీపంలో ప్రమాదకరంగా మలుపు